
మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం

జిల్లా ఆస్పత్రిలో ప్రపంచ బ్యాంకు బృందం తనిఖీలు


ఉట్నూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిని ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు బుధవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. బృందం సభ్యులు ఎస్.కృష్ణ, రంజన్, బి.వర్మ, అనికేత్ ఘనశ్యామ్ తనిఖీ చేసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.ఉపేందర్ జాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డా.కపిల్ నాయక్, ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ మహేందర్, నర్సింగ్ సూపరింటెండెంట్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్, కమిషనర్ కార్యాలయం రాష్ట్ర నాణ్యత నిర్వాహకులు రాధిక, రాష్ట్ర డీడీ ఎం.జాన్సన్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్ జాదవ్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి దేవిదాస్ ఏవో గిరీష్. డీడీఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి చెక్కు అందజేత

ఉట్నూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన విద్యార్థికి రూ.25 వేల చెక్కు అందజేసినట్లు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ప్రాజెక్ట్ అధికారి ఛాంబర్‌లో ఉన్నత విద్య కోర్సులలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన మండలంలోని శ్యాం నాయక్ తండా గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి రాథోడ్ దీపిక్‌కు ప్రోత్సాహకంగా చెక్కును అందించామన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో వారివారి ప్రతిభ కనబరిచాలని, అందరికీ ఆదర్శంగా నిలవాలని పీవో ఈ సందర్భంగా సూచించారు. ఎంబీబీఎస్ చదవు కోసం వారి తల్లిదండ్రుల సమక్షంలో పైచదువుల నిమిత్తం చెక్కును గిరిజన విద్యార్థికి అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అన్నదాత.. ఆగమాగం




రోజుల తరబడి కుప్పలు పోసి ఉంచడంతో నలుపు బారుతున్న సోయా గింజలు

జిల్లాలో ఈయేడు.. కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు.. ప్రస్తుతం మొంథా తుఫాన్ కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అసలే అంతంతమాత్రంగా వస్తున్న దిగుబడులను అమ్ముకునేందుకు గోసపడుతున్నారు. గత రెండు రోజులుగా వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆకాశం మేఘావృతమై జిల్లావ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చేతికి వచ్చిన పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడతున్నారు.

ఆదిలాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించినా.. పంటలను అమ్ముకునే పరిస్థితి లేదు. తేమ శాతం అధికంగా ఉండడంతో కొనుగోలు కేంద్రాలలోనే ఆరబెడుతూ రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. జిల్లాలో 4లక్షల 8వేల ఎకరాలలో పత్తి పంట సాగయ్యింది. దీంతో 33 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 2,800 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే సోయా పంటను కొనుగోలు చేయాలని రైతులు జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారు. వెంటాడుతున్న అకాల వర్షాలతో అన్నదాతలు అతలాకుతలమవుతున్నారు. చేతికి వచ్చిన పంటలు చేజారి పోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

నిలిచిపోయినా కొనుగోళ్లు

మొంథా తుఫాన్ ఎఫెక్ట్‌తో సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లను పూర్తిగా నిలిపి వేశారు. తుఫాన్ కారణంగా బుధవారం కొనుగోలు ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో గురువారం కూడా కొనుగోళ్లను ప్రారంభించే అవకాశం కనిపించడం లేదు. తుఫాన్ ప్రభావం తగ్గుముఖం పట్టేంత వరకు కొనుగోలు నిలిచిపోయే అవకాశం ఉంది. పత్తిలో అధిక తేమ, వర్షాల కారణంగా సీసీఐ, ప్రైవేట్ వ్యాపారాలు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు.

- జిల్లాలో కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆందోళన
- తుఫాన్ ఎఫెక్ట్‌తో నిలిచిన పత్తి కొనుగోళ్లు
- ఆరబెట్టే అవకాశం లేక నలుపు బారుతున్న దిగుబడులు
- పగబట్టిన ప్రకృతితో రైతులు విలవిల
- జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో 4.8 లక్షల ఎకరాలలో సాగైన పత్తి పంట


● పంట చేనులోనే నాణ్యతను కోల్పోతున్న పత్తి

గడిచిన రెండు రోజుల్లోనే రూ.140 వరకు ధర తగ్గించి.. రూ.6,810లకు కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. కేవలం 8 నుంచి 12 తేమ శాతం ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ఆపైగా తేమ ఉన్న పత్తిని నిరాకరించడంతో ప్రైవేట్ వ్యాపారులు అదునుచూసి దుండుకుంటున్నారు. తేమ శాతం, సీసీఐ నిబంధనలపై వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తే కొంతవరకు రైతులకు

(తరువాయి 6వ పేజీలో....)

నేడు సోనాల బంద్‌కు పిలుపు

బోథ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైతుల పండించిన పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, రైతులపై ప్రభుత్వం కేసులు పెట్టించడాన్ని నిరసిస్తూ గురువారం సోనాల మండలం బందుకు పిలుపునిస్తున్నట్లు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పంట కొనుగోలు చేపట్టడం ప్రభుత్వానికి చేతకాక రైతుల తరఫున పోరాడుతున్న వారిపై కేసులు పెట్టించడం రైతుల సహనాన్ని పరీక్షించినట్లేనన్నారు. రైతన్నను కన్నీరు పెట్టిస్తే ప్రభుత్వాలు కూలిపోక తప్పదు అన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా గురువారం బందు విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం సోనాల మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోతే.. ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో లంబాడా, బంజారా, సుగాలిలకు 1950 సంవత్సరం నుంచి ఇక్కడ నివసిస్తున్నట్లు నిర్ధారణ చేసిన తర్వాతనే ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని వచ్చిన ఉత్తర్వులను జిల్లా యంత్రాంగం పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సెడ్మాకి రామారావు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన పాల్గొని పలు వివరాలను వెల్లడించారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. ఆదేశాలను ఉల్లంగించి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే తహసీల్దార్లపై న్యాయ పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి


సైకిల్ ర్యాలీలో సీఐ ఫణిందర్, ఎస్సై విష్ణువర్ధన్, పోలీస్ సిబ్బంది

- సీఐ ఫణిందర్
- నేరడిగొండ, తాంసిలలో కొవ్వొత్తుల ర్యాలీ
- జిల్లాలో కొనసాగుతున్న పోలీసు అమరుల వారోత్సవాలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ రూరల్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం అనుకుంట గ్రామం నుంచి యాపల్‌గూడ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఫణిందర్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సైకిల్ యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. పోలీసుల అమరవీరుల త్యాగాలు మరువలేనివని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులర్పించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకుంటూ దానికి గుర్తుగా ప్రతి ఏడాది అక్టోబర్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించుకుంటామన్నారు. పోలీసులు లేని సమాజాన్ని మనం ఊహించుకోలేమని, ప్రజల క్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తూ కుటుంబాన్ని సైతం మరిచి సమాజ శ్రేయస్సు కోసమే బతికే పోలీసుల జీవితాలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అమరులైన పోలీసుల సేవలను ఈ సందర్భం కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విష్ణువర్ధన్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సీఐ రాజు అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జై జవాన్.. జై పోలీస్ నినాదాలతో పురవీధుల గుండా చేపట్టిన ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అమరవీరులు అందించిన స్ఫూర్తితో ప్రజల రక్షణ, భద్రత విషయంలో ముందుకు సాగుతున్నామని అన్నారు. అమర పోలీసుల త్యాగాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతాయని తెలిపారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పండరి, నాయకులు రాజశేఖర్ రెడ్డి, సద్దాం, దేవేందర్ రెడ్డి, పోతారెడ్డి, క్రాంతి సాగర్ రెడ్డి, లచ్చన్న, సాయి, సంతోష్ గౌడ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: పోలీసుల అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో బుధవారం రాత్రి 7.30కి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తాంసి ఎస్ఐ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పురవీధుల గుండా తిరుగుతూ అంబేడ్కర్ చౌక వద్దకు ఈ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు యువకులు, యువతులు, విద్యార్థులు, విద్యార్థినిలు, చిన్నపిల్లలు పెద్దఎత్తున హాజరయ్యారు. అమరవీరులకు ప్రత్యేక నివాళులు అర్పించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఏర్పడితే వెంటనే తమను సంప్రదించాలని కోరారు. యువతీ, యువకులు తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చే ప్రయత్నంలో ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలని సూచించారు. ఈ సందర్భంగా గత వారం రోజుల నుంచి వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఇచ్చోడ: కుటుంబ క్షేమం కంటే సమాజ క్షేమమే ముఖ్యమంటూ పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారని విద్యాలయ పాఠశాల కరస్పాండెంట్ మార శ్యాంరెడ్డి అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో పోలీసు అమవీరుల సంస్మరణ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా విద్యాలయ పాఠశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది పట్టణంలోని నిర్మల్ బైపాస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ కూడలి వరకు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పురుషోత్తం, సిబ్బంది దత్తాత్రేయ, సిద్దార్థ, విష్ణు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


నేరడిగొండలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


తాంసిలో కొవ్వొతుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, యువకులు


ఇచ్చోడలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు


గొల్లగడ్‌లో పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నాణ్యతగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- గొల్లగాడ్ గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్

భీంపూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గొల్లగాడ్ సందర్శించిన కలెక్టర్ పీఎం జన్మన్ పథకం కింద మంజూరు అయిన రహదారి పనులను నాణ్యతగా వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. మండలంలోని గొల్లగాడ్ గ్రామానికి బుధవారం కలెక్టర్ సందర్శించారు. రూ.4.48 కోట్లతో మంజూరు అయిన ఐదు కిలోమీటర్ల ఈ రోడ్డు అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. తర్వాత కలెక్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులను చూశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా పిల్లలకు వడ్డించారు. మిషన్ భగీరథ నీటి గురించి విద్యుత్ త్రీ ఫేజ్ గురించి స్థానికులు అడిగిన సమస్యలు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో నిరంతర పరిశుభ్రత చర్యలు కొనసాగాలని స్పష్టం చేశారు. అక్కడ పీవీటీజీ కింద నిర్మాణాలు పరిశీలించారు. ఆ తర్వాత గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాజీ సర్పంచ్ బక్కి భోజన్న కలెక్టర్‌ను సన్మానించారు. కలెక్టర్‌తో పంచాయితీ రాజ్ ఈఈ శివరామ్, తదితరులు ఉన్నారు.

'గోండ్వాన దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి'

ఉట్నూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ దేవతలు ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రాజ్ గోండు సేవా సమితి ప్రతినిధులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూగుప్తాను కలిసి గోండ్వాన దేవతల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. గోండ్వాన దేవతలు పెర్సపెన్, జంగు లింగో, నాగోబా, కలికాంకాళి, భీమాల్ పెన్, అకాడ, ఎత్మ సుర్, మహదేవల్, గ్రామ దేవతలు, వంశ దేవతలు, కుటుంబ దేవతలు, అలాగే గోండు, కొలాం, నాయకపోడ్, పర్దన్, తోటి, తెగల దేవతలకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం జీవో తీసుకొచ్చి ఆదివాసీ దేవతలకు నిధులు కేటీయిస్తునందున తెలంగాణ ప్రభుత్వం కూడా దూప, దీప, నైవేద్యం లాంటి కార్యక్రమాలకు, ఆలయాల అభివృద్ధి కోసం, పెన్ కటోడలకు దేవస్థానాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం జీవో తీసుకొచ్చి ఆదివాసీ దేవతలకు, దేవస్థానల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని గోండ్వాన గోండు మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం అర్జు, రాజ్ గోండు సేవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషం రావు, గేడం నిరంజన్, ఆత్రం ప్రకాష్‌లు కోరారు. వారి వెంట ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు మడావి బాలాజీ, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆత్రం వెంకట్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు ఆత్రం కాశీరం, మండల ఉపాధ్యక్షుడు అడా భీంరావు, తదితరులు పాల్గొన్నారు.


పీవోకు వినతిపత్రం అందజేస్తున్న రాజ్ గోండు ప్రతినిధులు

పంచాయతీ కార్యదర్శి తీరుపై నిరసన

ఆదిలాబాద్(ఆదిలాబాద్ రూరల్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చందా(టి) గ్రామంలోని పంచాయతీ కార్యదర్శి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆ గ్రామ యువకులు గ్రామ పంచాయతీ ఎదుట కూర్చొని నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం పూర్తిగా పడకేకిందని, ఒక్కసారి కూడా బ్లీచింగ్ పౌడర్ చల్లడం గాని ఫాగింగ్ చేయడం గాని లేదన్నారు. గ్రామంలో ఇంటింటికి నల్లలు కూడా సరిగా రావడం లేదన్నారు. ఎన్నిసార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని, ఇంటి నల్లాలకు వచ్చే పైపులు లీకేజీ ఉన్నాయని చెప్పినా.. పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో పిచ్చిమొక్కలు పెరిగిపో యి పాములు కూడా సంచరిస్తున్నాయని, గ్రామంలో దోమలు పెరిగిపోయి ఎందరికో విష జ్వరాలు కూడా రావడం జరుగుతుందన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిరసన తెలుపుతున్న ప్రదేశానికి చేరుకొని.. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని నచ్చజెప్పడంతో ధర్నాను విరమించారు.


పంచాయతీ కార్యాలయం ముందర నిరసన తెలుపుతున్న యువకులు

అవాస్తవాల ప్రచారం తగదు

- రిమ్స్‌లో అత్యంత నాణ్యమైన సేవలలను అందిస్తున్నాం
- ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ స్పష్టీకరణ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందిన రోగి అంశంపై రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ రాథోడ్ స్పష్టీకరణ ఇచ్చారు. బుధవారం డైరెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బేల మండలం సదల్పూర్ గ్రామానికి చెందిన టీకం పోతుబాయి అక్టోబర్ 6న రిమ్స్‌లో చేరినట్లు తెలిపారు. రోగికి అక్టోబర్ 7న సీటీ స్కాన్, 11న ఎంఆర్ఐ పరీక్షలు నిర్వహించామని చెప్పారు. రోగి స్థితిని స్వయంగా పరిశీలించి, మెరుగైన చికిత్స అందించాలంటూ జనరల్ మెడిసిన్ విభాగ వైద్యులకు సూచించినట్లు తెలిపారు. వ్యాధి పూర్తి నిర్ధారణ కోసం కాంట్రాస్ట్ ఎంఆర్ఐ అవసరమని రేడియాలజీ నిపుణులు సూచించగా, ఆ ఇంజక్షన్ సాధారణంగా అరుదుగా ఉపయోగించే ఔషధమని చెప్పారు. ఆ ఔషధం ప్రభుత్వ టెండర్ జాబితాలో లేకపోవడంతో స్థానిక ఔషధ సరఫరాదారులను సంప్రదించగా అందుబాటులో లేదని, అనంతరం హైదరాబాద్‌లోని ఏజెన్సీలను సంప్రదించినప్పటికీ వరుస సెలవుల కారణంగా సరఫరా ఆలస్యమైందని వివరించారు. అయితే మానవతా దృక్పథంతో వెంటనే చర్యలు తీసుకొని ఆ ఔషధం ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా రిమ్స్ యాజమాన్యం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రోగి కుటుంబ సభ్యులకు పరిస్థితి వివరించగా, వారి అభ్యర్థన మేరకు డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఔషధం లభ్యమైందని కుటుంబానికి రిమ్స్ యాజమాన్యం సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వయంగా బేల మండలం సదల్పూర్ గ్రామానికి వెళ్లి రోగి కుటుంబానికి వివరాలు తెలియజేసి, రిమ్స్‌లోనే చికిత్స కొనసాగించవచ్చని సూచించినట్లు డైరెక్టర్ తెలిపారు. రోగికి మెరుగైన సేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, అనవసర ఆరోపణలు చేయడం, అవాస్తవాలను ప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. సమావేశంలో రిమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



ఇంటిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్లు, డీఆర్‌డీఏ పీడీ

కోట(కె)లో ఇందిరమ్మ ఇల్లు పరిశీలన

▶▶ చెట్టుకు కట్టేసిన ఘటనపై విచారణ

బోథ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని కోట(కె) గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ రవీందర్‌ను పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు లబ్ధిదారులు భర్తతో గొడవ జరగడం.. ఇదే సందర్భంలో లబ్ధిదారురాలి భర్త మారుతిని కాంట్రాక్టర్ సత్యనారాయణ చెట్టుకు కట్టి వేసిన సంఘటనపై విచారించేందుకు బుధవారం సోనాల ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి గ్రామానికి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ నిర్మించిన ఇంటిని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు విచారణ చేపట్టారు. అయితే లబ్ధిదారున్ని చెట్టుకు కట్టి వేయడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. అలాగే, ప్రభుత్వమే ఇళ్ల నిర్మించి ఇవ్వాలని, ఇందిరమ్మ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ లబ్ధిదారునిపై దాడికి దిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్యనారాయణపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

▶▶ డీఐఈవో గణేష్ జాదవ్

తాంసి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా మాధ్యమిక విద్యాధికారి గణేష్ యాదవ్ అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని ఫైలను పరిశీలించారు. అధ్యాపకులు బోధిస్తున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు ఏ సమయంలో అధ్యాపకులు వస్తున్నారు? పరిశీలించారు. కళాశాల పరిసరాల పరిశుభ్రతపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు తనదైన శైలిలో పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా అధ్యాపకులు చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా కళాశాలకు రోజుల తరబడి రాని విద్యార్థులపై సంబంధిత తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించాలన్నారు. ఎందుకు కళాశాలకు రావడం లేదు.... అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఉదయ్, సంతోష్, మల్లేష్, దేవేందర్, తదితరులు ఉన్నారు.



కళాశాల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డీఐఈవో

నిబంధనలు పాటించకుంటే చర్యలు

▶▶ ఉట్నూర్ ఏఎస్పీ

ఇచ్చోడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకపోయినా, ఆటోలు ఎక్కడబడితే అక్కడ నిలిపినా చర్యలుంటాయని, వాహనదారులకు వాహన పత్రాలతో పాటు లైసెన్స్, హెల్మెట్, సరైన నెంబర్ ప్లేట్స్ తప్పనిసరిగా ఉండాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ సూచించారు. ఇచ్చోడ మండలంలోని గుండాల గ్రామంలో బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బందితో కలిసి కార్డన్‌సెర్చ్(నిర్బంధ తనిఖీ) నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. పోషకులు మైనర్లకు వాహనాలు ఇవ్వద్ద ని హెచ్చరించారు. గుండాల తనిఖీల్లో నంబరు ప్లేట్లు, వాహన పత్రాలు లేని 36 ద్విచక్రవాహనాలు, ఆరు ఆటోలు, రెండు ట్రాక్టర్లను స్వాధీన పరుచుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. నిబంధన లు పాటించని వాహనదారులపై ఉన్న చాలన్లరుసుంను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సర్కిల్ సీఐ బండారి రాజు, ఎస్సైలు పురుషోత్తం, శ్రీకాంత్, ఇమ్రాన్, పోలీసు సిబ్బం ది, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్



పట్టుకున్న ద్విచక్రవాహనాలు, ఆటోలు

'కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు'

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాల రాస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ఆరోపించారు. బుధవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్మికుల హక్కులు, ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై చర్చించి ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అదేవిధంగా ఈనెల 31న నిర్వహించే ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించిన చట్టాలను కార్పొరేట్ శక్తులకు అప్పగించేలా నాలుగు కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిందన్నారు. ఇందులో దేవేందర్, గోవర్ధన్, గాజంగుల రాజు, రాజన్న, గంగయ్య, రమణ, ఉస్మాన్, అశన్న, చంద్రకళ, గోదావరి, నరేందర్, ఆయా మండలాల కార్యదర్శులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి'

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల సాధనకు నవంబరు 7వ తేదీన నిర్వహించనున్న భారీ నిరసన దీక్షను విజయవంతం చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మా రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వహించడం సరికాదన్నారు. నిరసన దీక్షలో పెన్షనర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సోషల్ మీడియాతో మానసిక సమస్యలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో యువత ఎదుర్కుంటున్న సమస్యలపై నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్ఐవో రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ఫరాజ్ అహ్మద్ పాల్గొని పలు వివరాలను వెల్లడించారు. అతిగా సోషల్ మీడియా వాడకం వల్ల హింస పెరిగిపోతోందని, అసభ్యత పెరుగుతోందని అన్నారు. ప్రతీ ఏడుగురిలో ఒకరు తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. యువత ఈ సమస్యలను అధిగమించే దిశగా అవగహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విశ్వ హిందూ పరిషత్ కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో విశ్వ హిందూ పరిషత్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి చింతల వెంకన్న పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసిన అనంతరం భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. కాగా, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా నానందుల రాజ్ కుమార్, కార్యదర్శిగా రవి గిత్తే, ఉపాధ్యక్షుడిగా శారద, సహ కార్యదర్శిగా రమేష్‌తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. పాత కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమయంలో కొంత మార్పు ఇవ్వాలని, 5నిమిషాలు ఆలస్యంగా వచ్చినా తమను అనుమతించకపోవడం సరికాదని కళాశాల విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కళాశాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను లోనికి అనుమతించకపోవడంతో నిరసన తెలిపారు. వీరికి ఏబీవీపీ నేతలు మద్దతు పలికారు. సమయపాలనలో ప్రిన్సిపాల్ కఠినంగా వ్యవహరించడం సరికాదన్నారురు. ఉదయం 9.30 నిమిషాల నుంచి సాయంత్రం 4.20 నిమిషాల వరకు కళాశాల సమయం కాగా.. నిర్దేశిత సమయం తర్వాత కొంత ఆలస్యంగా వచ్చినా.. గేట్లకు తాళం వేస్తున్నారని విద్యార్థులు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న తమకు కొంత ఆలస్యం జరిగినా అనుమతి ఇవ్వడం లేదని, మధ్యాహ్న భోజన సమయంలోను 5 నిమిషాలు కూడా వెసులుబాటు ఇవ్వడం లేదని ఆరోపించారు.



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

అన్నదాత.. ఆగమాగం

(5వ పేజీ తరువాయి...)

మేలు జరిగే అవకాశం ఉంటుంది.

దెబ్బతింటున్న నాణ్యత

అధిక తేమ కారణంగా పత్తి, సోయా పంటల నాణ్యత దెబ్బతింటోందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత పక్షం రోజుల క్రితమే పంటలు చేతికి వచ్చినా.. ఆరబెట్టి అమ్ముకునే అవకాశం లేక పంటలు నలుపుబారీ నాణ్యత కోల్పోతున్నాయని చెబుతున్నారు. రోజుల తరబడి సోయా పంట కుప్పలు పోసి ఉంచడంతో గింజలు పూర్తిగా రంగు మారి నలుపుగా మారుతున్నాయని, పత్తిని ఇళ్లలో నిల్వ చేసుకునే అవకాశం లేక అధిక తేమతో పంట చేనులోనే నేలరాలి నాణ్యత కోల్పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లేకపోవడంతో మద్దతు ధర దక్కే అవకాశం ఉండదంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించే అవకాశం లేక రైతులు స్థానికంగానే తక్కువ ధరకైనా దళారులకు అమేసుకుంటున్నారు.

కొందరికే మద్దతు

వెంటాడుతున్న పకృతి వైపరీత్యాలు మార్కెట్ పరిస్థితులు సీసీఐ కఠినమైన నిబంధనలతో కొంత మంది రైతులకే మద్దతు ధర దక్కుతుంది. ఇప్పటి వరకు జిల్లాలో 2,800 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా.. సీసీఐ కేవలం 94మంది రైతుల నుంచి 1,964 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. అదే విధంగా ప్రైవేట్ వ్యాపారులు 335 మంది రైతుల నుంచి 6,577 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. దీన్ని బట్టి చూస్తుంటే పత్తి రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే తెలుస్తూనే ఉంది. తేమ శాతం పేరిట సీసీఐ నిరాకరించడంతో ప్రైవేట్ వ్యాపారాలు అడ్డగోలుగా ధరలను నిర్ణయిస్తూ కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులతో ఎక్కువ మంది రైతులు స్థానికంగానే దళారులకు అమ్మేసుకుంటూ నష్టపోతున్నారు. అయినా అధికారులు దృష్టి సారించడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు.

డిగ్రీ అతిథి అధ్యాపకులకు అందని వేతనాలు

▶▶ జిల్లాలోని 3 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాలుగు నెలలుగా అందని వేతనాలు

▶▶ కనీస ఉద్యోగ భద్రత లేకుండా విధులు

ముథోల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యాశాఖలో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు సుమారు నాలుగు నెలలుగా వేతనాలు రాక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరకొర వేతనాలతో సేవలందిస్తున్న డిగ్రీ అతిథి అధ్యాపకులకు సమయానికి వేతనాలు అందక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. నాలుగు నెలలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో మొత్తం 3 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 32 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 12 మంది విధులు నిర్వహిస్తుండగా భైంసా గోపాల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 12 మంది, ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 8 మంది అతిథి అధ్యాపకులు పని చేస్తున్నారు. రెగ్యులర్ అధ్యాపకులతో పాటు తాము కూడా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేదంటున్నారు. వచ్చే వేతనం కూడా నెల నెల సక్రమంగా రావడం లేదని, అలాగే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పేర్కొంటున్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరుతో పాటు అక్టోబరు మాసం కూడా పూర్తవుతుందని ఆయా మాసాలకు చెందిన వేతనాలు అందడం లేదని వాపోయారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని, సమయానికి వేతనాలు అందడం లేదంటున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సేవ చేస్తున్నామనే సంతృప్తి తప్పా కుటుంబ పోషణ భారంగా మారిందని, నెల నెల వేతనాలు రాక అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి తమ పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందజేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకుంటున్నారు.

హరీష్ రావును పరామర్శించిన మాజీ మంత్రి



హరీష్‌రావును పరామర్శిస్తున్న మాజీమంత్రి

నిర్మల్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును మాజీమంత్రి పరామర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ మరణించడంతో బుధవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో హరీష్‌రావు కుటుంబ సభ్యులను మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పరామర్శించారు.

రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



కొనుగోలు కేంద్రం వద్ద తహసీల్దార్

కుంటాల, అక్టోబరు, 29 : (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ కమల్‌సింగ్ అన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో కుంటాలలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, సోయా కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతుల ధాన్యం ఎప్పటికప్పుడకు తూకం వేసి సంబంధిత గోదాములకు తరలించాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎండ వేడిమి నుండి తట్టుకునేందుకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈయన వెంట సహకార సంఘం సిబ్బంది, రైతులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

కుంటాల, అక్టోబరు, 29 : (ఆంధ్రజ్యోతి) : రైతులు విత్తనాలు ఎంపిక చేసుకునే సమయంలో నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని ఏఈవో శ్రీనివాస్ అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం లింబా (కే) గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి శాస్త్రవేత్తలు కార్తీక్, దినేష్ పాల్గొని రైతుల వరిపైరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పురుగుల మందులు అతిగా వాడకూడదని నానో డీఏపీ లాంటివి వాడితే దిగుబడులు పెరిగే అవకాశం ఉందని వారు సూచించారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు ఉన్నారు.



లింబా(కే)లో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో తర్లపాడ్ ఆదర్శం

▶▶ ఖానాపూర్ ఎంపీడీవో రమాకాంత్

ఖానాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తర్లపాడ్‌కు చెందిన లబ్ధిదారులు ఆదర్శనీయంగా నిలుస్తారని ఖానాపూర్ ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో మరింత వేగం పెంచాలని సూచించారు. తర్లపాడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో ఇదివరకే పలు ఇళ్లకు స్లాబ్‌లు వేయడం, మరి కొన్ని ఇళ్ల స్లాబ్ లెవల్‌కు రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుత వేగంతోనే పనులు కొనసాగిస్తే జిల్లాలోని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన మొదటి గ్రామంలో తర్లపాడ్ నిలుస్తుందన్నారు. లబ్ధిదారులతో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు సార్ల నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి రిజ్వానాలను అధికారులు అభినందించారు. కుటుంబవివాదంతో నిలిచి పోయిన ఇళ్లను సైతం నిర్మాణం పూర్తి చేయించాలని ఇందిరమ్మ కమిటీ బృందానికి, పంచాయతీ కార్యదర్శికి సూచించారు.



నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమాకాంత్

ఎంపీడీవోకు సన్మానం

లోకేశ్వరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... లోకేశ్వరం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సల్మాన్ రాజ్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, ఈజీఎస్ సిబ్బంది, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్, క్యాషియర్ నగేష్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తరోడా గ్రామ బీసీ జేఏసీ కమిటీ ఎన్నిక

ముథోల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని తరోడా గ్రామ బీసీ జేఏసీ కమిటీని బుధవారం ఏర్పాటు చేసినట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడు కే.మాధవరావు, అధ్యక్షుడుగా కే.లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, కోశాధికారిగా పల్లికొండ గణేష్, ప్రధాన కార్యదర్శిగా సీలం హన్మాండ్లు, కార్యదర్శిగా ఆర్. దిలీప్, సహాయ కార్యదర్శిగా ఎస్. రాములు, సలహాదారులుగా ఎన్. రాజా గౌడ్, ఎం. మోహన్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

కుంటాల, అక్టోబరు, 29 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ఆర్‌టీఐ సామాజిక కార్యకర్తల ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖలీం ఈ సందర్భంగా విద్యార్థులు సమాచార హక్కు చట్టం పట్ల విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన 30 రోజులు గడిచినా సమాచారం ఇవ్వకుంటే మొదటి అప్పీలు, రెండవ అప్పీలు ఎలా చేయాలి అనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయవాది జక్కుల గజేందర్ మాట్లాడుతూ చట్టం ప్రాధాన్యత, అవినీతి అక్రమాలను అరికట్టే విధానం పై విద్యార్థులకు విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డీ. గజేంధర్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, సారంగాపూర్ మండల బాధ్యులు హఫీజ్, సయ్యద్ అబిద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాథోడ్ సురేష్, సంగీత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు ఉన్నారు.

సమస్యలపై పోరాడుతాం

▶▶ బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్(జి), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : గొల్లమాడ వద్ద రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, దీనిపై ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తక్షణమే స్పందించాలని బీఆర్‌ఎస్ నాయకులు దీక్షిత్ పటేల్ డిమాండ్ చేశారు. రోడ్డు గుంతల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని దీక్షిత్ పటేల్ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు, రోడ్లు దెబ్బతిన్నాయని, ప్రజలు కష్టాలు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గొల్లమాడ గ్రామాన్ని వెంటనే సందర్శించి, రోడ్ల పనులను (గొల్లమాడ నుండి కుంటాల, వైకుంఠాపూర్ వరకు) చేపట్టాలని, ఎన్నికల హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాకిడి రమేష్, చెన్న రాజు, లక్ష్మణ్, జేసీబీ రమేష్, హరీష్, గంగాధర్, సుదర్శన్, ఎర్రన్న, సాయి, వంశీ, తదితర బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



గుంతలమయమైన గొల్లమాడ రోడ్డు చూపిస్తున్న నాయకులు

బీసీ కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

తానూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోల్సా గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ నూతన భవన నిర్మాణానికి పంచాయతీ రాజ్ ఏఈ శివలింగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జంగు పోతన్న భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతన్న మాట్లాడుతూ మాజీఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరయ్యాయని, దీంతో భవన నిర్మాణం చేపడతున్నట్లు తెలిపారు. బోల్సా గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ పోతన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై అవగాహన



మాట్లాడుతున్న ఉపాధిహామీ ఈసీ జితేందర్

తానూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ కొత్తపనుల ఎంపిక, ఉపాధిహామీ పనులపై అవగాహన గ్రామసభ ఉపాధిహామీ ఈసీ జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా పశువుల పాక, గొర్లు, మేకలు పాక వ్యవసాయ చేనులోకి వెళ్లే రోడ్డుల పనుల ఫారం ఫండ్ ఇంకుడు గుంతలు ఎలా నిర్మించుకోవాలి అనే అంశంపై ఏ పోశెట్టి గ్రామస్తులకు, ఉపాధిహామీ కూలీలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీమన్, మాజీసర్పంచ్ చంద్రకాంత్ యాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ చిరంజీవి గ్రామకార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

తానూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.8వేల స్కాలర్‌షిప్ రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని బోల్సా ఉపసర్పంచ్ జవారే భీంరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 నెలలు అవుతున్న విద్యార్థుల స్కాలర్‌షిప్ రీయంబర్స్‌మెంట్‌ను ఇప్పటికీ విడుదల చేయలేదని, దీంతో విద్యార్థులు చదువులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అదేవిధంగా హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల, పోషకులతో కలిసి ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న జవారే భీంరావు

దాహమేస్తే.. ఇంటికే!

ఉట్నూర్, అక్టోబరు 29 (ఆం ధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల మత్తడి గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న బోరు బావి చెడిపోయి పది నెలలు గడుస్తున్న మరమ్మ తులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు ఉపాధ్యా యులు మధ్యాహ్న భోజనకార్మికలు ఈ ఇ బ్బందులను అధికారు లకు విన్నవించిన అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడంతో విద్యార్థులు మంచి నీటి కోసం ఇబ్బందులు పడతున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన చెరువు చెంతనే పాఠ శాల ఉంది, బోరుబావి ఉంది, కానీ మర మ్మతులు చేయించే అధికారులు లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజు తమ తమ ఇంటి నుంచి మంచినీళ్లు బాటిల్లలో తెచ్చుకుంటు న్నారు. నీరు అయి పోతే మళ్లీ ఇంటికివెళ్లి నీరు తెచ్చు కోవాల్సిందే అంటు న్నారు. మధ్యాహ్న భోజనం వండే కార్మికులు సైతం బిందెలతో ఇంటి నుంచి నీరు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజు మధ్యాహ్న భోజనం వండడానికి ఊరిలోని బోరింగ్ నుంచినీళ్లు తెచ్చి వండడం చాలా ఇబ్బంది అవుతుందని మధ్యాహ్నభోజన కార్మికు రాలు సాక్రు బాయి ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఇప్పటి కైనా అధి కారులు స్పందించి విద్యార్థుల ఇబ్బంది అర్థం చేసుకొని పాఠ శాలకు వెంటనే నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకో వాలని గ్రామస్థులు కోరుతున్నారు.


విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్ల బాటిళ్లు


పనిచేయని బోరు బావి

జాతీయ రహదారిపై
చిరుతపులి సంచారం


చిరుత పాదముద్ర


చిరుత అడుగులను పరిశీలిస్తున్న అధికారులు

ముథోల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాసర, భైంసా జాతీయ రహదారిపై ముథోల్ కంటి ఆసుపత్రి సమీపాన మంగళవారం రాత్రి చిరుతపులి వాహన దారులకు కనిపించింది. చిరుతపులి రోడ్డు దాటి ముథోల్ శివారు వైపు వెళ్లిందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయం బుధవారం తెలుసుకున్న భైంసా డివిజన్ ఫారెస్ట్ అధికారులు సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్, బీట్ ఆఫీసర్ కృష్ణలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రోడ్డు పక్కన, వ్యవసాయ చేనులో చిరుత పాదం ముద్రలను గుర్తిం చారు. చిరుత పులి సంచరిస్తున్న విషయాన్ని ధ్రువీకరించారు. వ్యవసాయ చేనులకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని వారు కోరారు. గుంపులు, గుంపులుగా చేతిలో కర్ర ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

క్రైం సమాచారం

వైన్స్ దొంగల అరెస్టు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రవణ్ కుమార్

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న రాత్రి బేల లోని కనకదుర్గా వైన్స్ షాప్‌లో జరిగిన దొంగతనంలో ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో బేలకు చెందిన పుసం నారా యన్,షిండే అజయ్, టికం జోషువలను అరెస్టు చేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో జైనథ్ సీఐ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ... కనకదుర్గా వైన్ షాప్ వెనుక భాగాన గల వెంటీలేటర్ పగులగొట్టి నిందితులు లోనికి ప్రవేశిం చారని తెలిపారు. రూ.13,400 విలువ గల లిక్కర్ బాటిల్స్, రూ.41,930 దొంగ తనం చేశారన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సీసీటీవీ ఫుటేజీ పరిశీ లించి,సాక్షులను విచారించారన్నారు.బుధవారం లిక్కర్‌బాటిల్లతో పారిపో తు న్న బాదితులను అరెస్ట్ చేసి వారి నుంచి చోరీ చేసిన వస్తువులు స్వాదీనం చేసుకు న్నామని,రూ.10320 విలువ గల లిక్కర్ బాటిల్స్, రూ.38630 నగదు, మో టార్ సైకిల్, రెండుమొబైలు ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల ను పట్టు కోవడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్సై ప్రవీణ్, సిబ్బందిని అభినందించారు.

ముంపు బాధితులు అధైర్య పడొద్దు

» బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్


దేగామలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆడే గజేందర్

బజార్‌హత్నూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేగామ గ్రామ ముంపు బాధితులు అధైర్యపడవద్దని, న్యాయం జరిగేలా చూస్తామని బోథ్ నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మల్లెపూల నర్సయ్యలు అన్నారు. బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ గ్రామాన్ని బుధవారం వారు సందర్శించారు. గతంలో గ్రామస్థులకు చెప్పి నట్లుగానే ఇళ్ల సర్వే ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధి కారులతో సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. ఈ సర్వే ఆధారంగా బాధితులకు న్యాయం చేసేలా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడుతానన్నారు. అనంతరం భూతాయితండా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారుల కోరిక మేరకు గ్రంథాలయ ఛైర్మన్‌తో కలిసి గడప పూజ చేశారు. ఆయన వెంట బోథ్ మార్కెట్ అధ్యక్షుడు బొడ్డు గంగయ్య, మండల అధ్యక్షుడు జల్కే పాండురంగ్, నాయకులు బద్దం పోతారెడ్డి, శివుడు, పోరెడ్డి నారాయణ, సూర్య వంశీ పాండురంగ్, సల్మాన్, కార్యకర్తలు ఉన్నారు.

మక్కరైతుకు పుట్టెడు కష్టాలు



» పంట నమోదులోనే తప్పులు
» ఆగమవుతున్న కౌలు రైతు
» దళారుల చేతికి మక్క పంట

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌రూరల్)అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ రూరల్ మండ లంలోని మక్కా రైతులకు తమ పంట అమ్ము కుందామన్న కష్టాలు తప్పడం లేదు. దీనికి ఒక రకంగా ప్రభుత్వం విధించిన నిబంధనలే కారణమని కూడా రైతులు ఆవేదన వ్యక్తం చే స్తున్నారు. పంట నమోదు కార్యక్రమంలో జరి గిన తప్పులలో మక్క పంట వేసిన రైతుకు పత్తి అని చూపించడంతో ఇప్పుడు రైతులు తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియ ని పరిస్థితి ఎదురవుతుందనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నమోదు కార్యక్రమం స మయంలో అధికారులు క్షేత్రస్థాయిలో వ్యవ సాయ భూములను చూడకుండానే పంటల ను నమోదు చేయడంతో ఈపరిస్థితిఎదు రైం దనిరైతులుఅనుమానం వ్యక్తపరుస్తున్నారు.


ఆర బెట్టిన మక్క పంట

కౌలు రైతు కష్టాలు

కౌలు రైతు కూడా తాను వేసిన పంటను ఇతరుల పట్టాలపై వేసి అమ్ముకోవాల్సిన పరి స్థితి వచ్చిందని, కౌలు రైతు అని చెప్పుకోవ డానికి తనవద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవ డంతో ఇతరుల పట్టాలను, భూయజమాని ప ట్టాపై పంటను అమ్ముకోవాల్సివస్తుందని వా పోతున్నారు.దీంతో అధిక మొత్తంలో రైతు లు తమపంటను ప్రైవేట్‌దళారులకే అమ్ము కోవాలసిన పరిస్థితులు వస్తున్నాయని వాపో యారు.

వర్షంతో ఇబ్బందులు

వాతావరణ పరిస్థితులు కూడా తమకు అనుకూలంగా లేకపోవడంతో తేమ 14 శాతం కంటే మించరాదని నిబంధనలు ఉండ డంతో రైతులకు ఏం చేయాలో పాలు పోవ డం లేదు. తేమ ఎక్కువగా వస్తుందని దీంతో వ్యవసాయ కొనుగోలు కేంద్రానికి వచ్చి న తర్వాత కూడా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితిలో వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తేమ శాతంలో సడలింపులు ఇవ్వాలని రైతులు కోరుకుంటున్నారు.

తెగిపడ్డ విద్యుత్ తీగ

» తప్పిన పెను ప్రమాదం


తెగిపడ్డ విద్యుత్ తీగ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బోథ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసు పత్రి సమీపంలో రోడ్డుపై బుధవారం విద్యుత్ తీగ తెగిపడింది అకస్మాత్తుగా విద్యుత్ తీగ తెగిపోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు విద్యుత్తు తీగ పడిన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రతిసారి ఈ రోడ్డుపై రద్దీ ఉండేది ఈ రూట్లో దాదాపు 12 గ్రామాల ప్రజలతో పాటు పట్టణ ప్రజల సైతం తిరుగుతారు ఎవరు లేని సమయంలో సంఘటన చోటు చేసుకోవడంతో కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్ తీగ తెగిందని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు రెండు నెలల కాలంలో భగత్ సింగ్ చౌక్ రోడ్డు పై విద్యుత్ తీగ తెగిపడడం వల్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగలను పరిశీ లించి అవసరమైతే కొత్త విద్యుత్తు తీగలను వేయాలని స్థానికులు అంటున్నారు.

విద్యారంగ సమస్యలపై బీఆర్ఎస్వీ ధర్నా


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నేతలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెండిం గ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బుధవారం కలెక్టర్ కార్యా లయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన నినాదాలతో చేపట్టారు. విద్యా రంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందని మండిపడ్డారు. ఈసందర్భంగా బీఆర్ఎస్వీ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. విద్యార్థులకు అండగా బీఆర్ఎ స్వీ నిలబడుతుందని స్పష్టం చేశారు.

ముందస్తు జాగ్రత్తలతో పక్షవాతం దూరం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :సమాజంలో పెరిగిపోతున్న పక్షవాతం దూరం చేసేందుకు ముందుజాగ్రత్తలు తీసుకుంటే దరి చేరదని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ మనోజ్ భరత్ అన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రదీప్ న్యూరో హాస్పిటల్ ఆధ్వర్యంలో వరల్డ్ స్ట్రోక్‌డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ మీదు గా అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ సా గింది. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ భరత్ తో పాటు ఐఎంఏ నిర్మల్ అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్, సీనియర్ వైద్యుడు డాక్టర్ దామెర రాములు, న్యూరో వైద్యుడు బీఎల్ నరసింహా రెడ్డి తదితరులు పక్షవాతం రాకుండా తీసుకో వాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పక్ష వాతం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. లక్షణాలు కనిపించిన గంట వ్యవధిలో ఆసుపత్రికి చేరితే పూర్తిగా కోలుకుంటారని ఆలస్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యా వంతులు సమాజంలో పక్షవాతంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కా ర్యక్రమంలో నిర్మల్ వైద్యుడుడాక్టర్‌ప్రణీత్, జీకే ప్రశాంత్, శ్రీనివాస్, రణీత్ కుమార్, యుగేష్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



వరల్డ్ స్ట్రోక్ డే అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు


చింతగూడలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు వేసిన పంచాయతీ కార్యదర్శి

ఉట్నూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్ పూర్ గ్రామపంచా యతీ పరిధిలో ఉన్న చింతగూడ గ్రామంలో గిరిజనులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ముగ్గులు వేయించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో గ్రామానికి మంజూరైన ఏడు ఇళ్ల నిర్మాణా నికి కొలతలు వేసి ముగ్గులు వేయించి పనులు ప్రారంభింప చేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తున్నందున లబ్ధిదారులు నాణ్య తగా ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామ పటేల్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ


తాహెర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఆదిలాబాద్ మాజీ జడ్పీ కోఆప్ష న్ సభ్యుడు తాహెర్ హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసుకున్న విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధ వారం వారిని కిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలన్నారు. అధైర్యపడవద్దని చికిత్స కోసం ఏమైనా సహాయం అందజేస్తానని అన్నారు

మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును
పరామర్శించిన పలువురు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ ఇటీవల తనువు చాలించిన నేపథ్యంలో హైదరాబాద్ లోని ఆయన నివాసానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ వెళ్లి ప్రగాఢ సాను భూతి వ్యక్తం చేశారు. తన్నీరు సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి హరీశ్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కామ్రే సత్యనారాయణకు
పార్టీ సభ్యత్వం రద్దు


పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఆడేగజేందర్

బోథ్,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని కోటకే గ్రా మానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారుడు మారుతిని చెట్టుకుకట్టి వేయడం అమానుషమైన చర్య అని చెట్టుకు కట్టివేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కామ్రే సత్యనారాయణ పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించడం జరిగించామని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడగజేందర్ తెలిపారు. బుధవారం సోనాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన సత్యనారా యణ వ్యవహరించిన తీరును జిల్లా కమిటీ ముఖ్యులతో చర్చించి సస్పెండ్ చేయడం జరిగింది అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి ఎవరు కూడా డబ్బులు వసూలు చేయరాదన్నారు అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా శిక్షిస్తామన్నారు విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవ విగ్రహానికి నిమజ్జనం


నిమజ్జనానికి తరలిన గ్రామస్థులు

ఉట్నూర్,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు రోజు లుగా మండల కేంద్రంలో వైభవంగా నిర్వహించిన కార్తీక దీపోత్సవ గణేష్ ఉత్సవ విగ్రహానికి బుధ వారం ఘనంగా నిమజ్జనం నిర్వహించారు.మండల కేం ద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలోని కార్తీక దీపోత్సవ ప్రాంగణం నుంచి గణేష్ విగ్రహాన్ని నిర్వాకులు ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువులో నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాడిగే రాజ్ గోపాల్, సంజీవ్‌రెడ్డి, రామిని నాగన్న, గోపాల్ సింగ్, లింగన్న, చింతల భీమన్న, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరు కుంట పాలు


వృథాగా పోతున్న భగీరథ నీళ్ల

ఆదిలాబాద్(ఆదిలాబాద్ రూరల్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపలగూడ గ్రామంలోని మిషన్ భగీరథ నీళ్ల ట్యాంక్ నిండి నీళ్లు వృథాగా పోతున్నాయి. దీని గురించి స్థానిక ప్రజలను అడగగా ఇది షరా మామూలేనని, ఈ నీటితోనే రెండు ఎకరలలో పక్కన ఉన్న కుంటను పూర్తిస్థాయిలో నిండిందని ప్రజలు వెటకారకంగా మాట్లాడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా ఇది సమన్వయ లోపంతో జరిగిందని, ఇకముందు అలా కాకుండా చూస్తామని తెలిపారు.


భగీరథ నీళ్లతో నిండిన కుంట

ఎన్ఈపీ-2020 సదస్సుకు డాక్టర్ కోలా కిరణ్



మావల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్య సంస్కరణలో భాగంగా దేశ వ్యాప్తంగా జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020 అమలు విధానంపై కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో నిర్వహించనున్న సెమినార్‌కు డైట్ ఇన్ చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కోలా కిరణ్ ఎంపికయ్యారు. రాష్ట్రంలోని డైట్ కళా శాలల నుంచి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్యా విధానంలో రెండు దశ బ్దాల అపార అనుభవం ఉన్న జిల్లా డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కోలా కిరణ్‌ను ఎస్‌సీఈఆర్‌టీ ఎంపిక చేసింది. రీజనల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మైసూర్‌లో ప్రాంతీయ సదస్సులు గురు, శుక్రవా రాల్లో రెండు రోజుల పాటు జరగనున్నాయి. ఈ సదస్సుల్లో శ్రీధర చార్యులు, ఎస్‌సీఈఆర్‌టీ టీం సభ్యులతో కలిసి ఆయన పాల్గొనున్నారు. జాతీయస్థాయి విద్య నిపుణుల సమక్షంలో తెలంగాణ రాష్ట్రంలో అమ లవుతున్న విద్యా విధానంపై ప్రసంగించను న్నారు. అదే విధంగా జాతీయస్థాయిలో విద్యారం గంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై ప్రజంటే షన్ ఇవ్వనున్నారు. అయితే ఆయన ఎంపిక పట్ల డైట్ కళాశాల అధ్యాపక బృందం, పలు ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు అభినందనలు తెలి పారు.



జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

నిర్మల్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం యువజన సంబరాలకు శ్రీకారం చుట్టిందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. వచ్చే నెల నాలుగో తేదీన తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల సోఫీనగర్‌లో యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకు జానపద నృత్య బృందం, జానపద పాటల బృందం, కవిత్వం, వ్యాసరచన, పెయింటింగ్, ఉపన్యాసం, ఇనోవేషన్ ట్రాక్ విభాగాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాలలోపు వయస్సు వారు అర్హులన్నారు.

హైవే విస్తరణ



- ఎన్‌హెచ్ 61 ఖానాపూర్ నుంచి ఛల్‌గల్ వరకు టూ లైన్స్ హైవే
- 54 కిలోమీటర్ల పొడవుతో నిర్మాణం
- రూ.750 కోట్ల అంచనా వ్యయం
- డీపీఆర్ తయారుకు సన్నాహాలు
- ఛత్తీస్‌గడ్‌లోని జగ్దల్‌పూర్‌తో హైవే అనుసంధానం
- భూసేకరణ ప్రక్రియే కీలకం

నిర్మల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ నుంచి జగిత్యాల జిల్లా ఛల్‌గల్ వరకు నిర్మించతలపెట్టిన నేషనల్ హైవే 61 విస్తరణ పనులకు ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ (ఎంవోఆర్‌టీహెచ్) ఖానాపూర్ నుంచి బాధన్‌కుర్తి మీదుగా జగిత్యాల జిల్లా ఛల్‌గల్ వరకు 54 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్న హైవే విస్తరణ పనుల కోసం రూ.750 కోట్ల రూపాయలను కేటాయించింది. మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి మొదలయ్యే నేషనల్ హైవేనంబర్ 61 తెలంగాణ రాష్ట్రంలోని భైంసా, నిర్మ ల్, ఖానాపూర్ మీదుగా జగిత్యాల జిల్లా చల్‌గల్ వరకు కొనసాగుతోంది. ఇక్కడ నిజామాబాద్ నుంచి చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని జగ్దల్‌పూర్ వరకు గల నేషనల్ హైవే 63కు ఈ హైవే లింకేజీ కానుంది. దీంతో మహరాష్ట్రలోని కల్యాణ్ నుంచి చత్తీస్‌ఘడ్‌లోని జగ్దల్‌పూర్ వరకు ఈ హైవే రోడ్డుమార్గం పూర్తిస్థాయిలో ఏర్పడనుంది. ప్రాథమి క సర్వే ద్వారా కేంద్రం ఈ నిధులను కేటాయించింది. దీంతో సంబంధిత నేషనల్ హైవే శాఖ అధికారులు డీపీఆర్ రూపకల్పనతో పాటు భూసేకరణ, అటవీ, ఇతర అనుమతులు లాంటి వాటిని సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. డీపీఆర్ రూపకల్పన పూర్తయితే భూసేకరణకు సంబంధించి గెజిట్ కూడా జారీ చేయనున్నారు.

బాధన్‌కుర్తి వరకు బైపాస్ రోడ్డు...

కాగా ఇప్పటికే నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు దాదాపు 35 కిలోమీటర్ల పొడవుతో నేషనల్ హైవే నంబర్ 61 పనులను పూర్తిచేశారు. ఈ రోడ్డుపై ఏడు చోట్ల అండర్ పాస్ పనులు ప్రస్తుతం పూర్తయ్యే దశకు చేరుకున్నా యి. ఈ అండర్ పాస్ పనులు పూర్తయితే ఇక ఖానాపూర్ వరకు హైవే పనులు దాదాపుగా పూర్తయినట్లే. ఇదిలా ఉండగా జగిత్యాల జిల్లా ఛల్‌గల్ వరకు విస్తరించనున్న ఈ రోడ్డు కోసం ఖానాపూర్ నుంచి బాధన్‌కుర్తి వరకు బైపాస్‌రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించారు. మొత్తం ఏడుకిలో మీటర్ల పొడవుతో ఈ బైపాస్ రోడ్డును నిర్మించనున్నారు. ఖానాపూర్ పట్టణానికి సమీపం లోని సాయిబాబా ఆలయం వెనక నుంచి ఈ బైపాస్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ మార్గంలో అటవీ శాఖకు సంబంధించిన భూములున్న కారణంగా ఆ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే బైపాస్ రోడ్డు కోసం భూ సేకరణ కూడా చేపట్టాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

డీపీఆర్ రూపకల్పనకు సన్నాహాలు...

కాగా ఖానాపూర్ నుంచి ఛల్‌గల్ వరకు విస్తరించతలపెట్టిన హైవేపనుల కోసం డీపీఆర్‌లను రూపొందించాల్సి ఉంటుంది. నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు చేపట్టిన హైవే పనులకు సంబంధించి రూపొందించిన డీపీఆర్‌ను బియాన్ సంస్థ చేపట్టింది. ప్రస్తుతం ఈ రోడ్డు విస్తరణ పనులకు కూడా ఇదే సంస్థ డీపీఆర్ రూపొందించనుంది. డీపీఆర్‌కు అనుమతులు లభించగానే సంబంధిత శాఖ భూసేకరణకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. నిర్మల్ జిల్లాలో ఏడుకిలో మీటర్లు, జగిత్యాల జిల్లాలో 47 కిలోమీటర్ల పొడవుతో భూములను సేకరించాల్సి ఉంటుంది. ఖానాపూర్ నుంచి మొదలయ్యే ఈ విస్తర ణ పనులు జిల్లాలోని బాధన్‌కుర్తి మీదుగా జగిత్యాల జిల్లాలోని ఛల్‌గల్ వరకు కొనసాగనుంది.

సవాల్ కానున్న భూసేకరణ...

కాగా ఖానాపూర్ నుంచి ఛల్‌గల్ వరకు పొడగించనున్న హైవే రోడ్డు నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఈ భూసేకరణ ప్రక్రియ సంబంధిత శాఖ అధికారులకు సవాలుగా మారే అవకాశం ఉందని అంటున్నారు. ముఖ్యంగా భూముల ధరలు పెరిగిపోవడం, కొన్ని చోట్ల ఇండ్లు పంట పొలాలున్న కారణంగా భూసేకరణకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. భూసేకరణ విషయంలో రెవెన్యూ శాఖ ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. డీపీఆర్ రూపొందించగానే దానికి అనుగుణంగానే భూసేకరణను చేపట్టనున్నారు. భూములు కోల్పోయే వారందరికి కొత్త నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాల్సి ఉం టుంది. ఈ పరిహారానికి సంబంధించిన డబ్బుల అంచనా కూడా మొత్తం రోడ్డు హైవే నిర్మాణ అంచనాల్లోనే కలిపి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే చాలా పథకాలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ అనేక వివాదాలకు కారణమవుతుండడంతో పనుల్లో జాప్యం ఏర్పడుతున్న సంగతి తెలిసిందే. అయితే ఖానాపూర్ నుంచి విస్తరించనున్న హైవే రోడ్డుకు కూడా భూసేకరణ ఎంత వరకు అనుకూలంగా ఉంటుందోననే అంశంపైనే ఆసక్తి నెలకొంటోంది.



అటవీ ప్రాంతంలోని రోడ్డు



ఎనిమల్ అండర్ పాస్ బ్రిడ్జి

కొనుగోలు కేంద్రం తనిఖీ



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

లోకేశ్వరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హవర్గా గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీక్లీనర్స్, టార్పాలిన్లు సరిపడినన్ని అందుబాటులో ఉన్నాయా అని తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. కేంద్రంలో నిర్వాహకుల వివరాలు, మద్దతుధర, టోల్‌ఫ్రీ నంబర్ వివరాలు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీలు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. టెంట్, తాగునీరు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే రసీదులు జారీ చేయడంతో పాటు వారి బ్యాంకు వివరాలను సక్రమంగా నమోదు చేసి, పంట రుసుము సకాలంలో రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం పం టకు మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి 2,389, బీ గ్రేడ్ రకానికి 2,369 కల్పిస్తోందని, రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఇవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ వ్యాపారులకు అమ్మినష్టపోవద్దని సూచించారు. ధాన్యాన్ని శుభ్రపరిచి, తగిన తేమశాతం కలిగిన తర్వాత మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు. వరి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా టోల్‌ఫ్రీ నంబర్ 9182958858ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, డీసీవో నర్సయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్‌లు

నిర్మల్ చైన్‌గేట్ : కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌ను నిర్మల్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాదిలు బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గురువారం నుంచి సోయా, పత్తి కొనుగోళ్ల ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రారంభోత్సవానికి రావల్సిందిగా కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రంలో రైతులు తమ పంటను విక్రయించుకుని మద్దతు ధరలు పొందాలని కోరారు.

ఖానాపూర్‌లో భారీ వర్షం



ఖానాపూర్‌లో ధాన్యం రాశులపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచిన దృశ్యం



కిట్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖానాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా ఖానాపూర్ మండలంలో అన్నదాతను మొంథా తుఫాను హడలెత్తిస్తోంది. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. మార్కెట్ యార్డ్‌లో ఆరబెట్టిన వరి ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పినప్పటికీ భారీ వర్షంతో ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క పంట చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో వరి కోతలకు ఈ వర్షం తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రనకా పగలనకా శ్రమించి పండించిన పంట చివరికి తుఫాను దాటికి చేతికందకుండా పోతుందేమోనని రైతులు మదనపడుతున్నారు. మొంథా తుఫాను అన్నదాతకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే వరి కోతలు పూర్తయి కల్లాలకు చేరిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కిట్ల అందజేత

నిర్మల్ రూరల్ : భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు సహాయంగా నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను నెస్లే సంస్థ తరపున కలెక్టర్ అభిలాష అభినవ్‌కు బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అందజేశారు. జిల్లాలో వరద వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు సహాయం అందించాలనే ఉద్దేశ్యంతో నెస్లే సంస్థ మొత్తం 600ల నిత్యవసర సరుకుల కిట్లను అందజేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ కిట్లు వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని కలెక్టర్ అన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన నెస్లే సంస్థ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో నెస్లే సంస్థ మేనేజర్ వసీం అహ్మద్, బోస్కో నెట్ ప్రతినిధి సత్యనారాయణ, ధపాస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర అందించడమే లక్ష్యం

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్



రైతును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

భైంసా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పంటకు మద్దతు ధర కల్పించే లక్ష్యంతోనే ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ అన్నారు. బుధవారం భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ అవరణలో డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన సోయా కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతన్నలు కొనుగోలు కేంద్రాల్లో తమ దిగుబడులను విక్రయించుకొని, మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా, ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు. ఇదే క్రమంలో కేంద్రాల నిర్వహణ లోపాలకు తావులేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలన్నారు. ఎలాంటి అవతవకలు, అవినీతి, అక్రమా లు చోటు చేసుకున్నా సహించబోమని వెల్లడించారు. మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్ సం ఘాలు, ఆత్మకమిటీలు బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అన్నదాతల సంక్షేమానికి, అభివృద్ధికి అంకితభావంతో పాటుపడాలని పేర్కొన్నారు. అం దరం కలిసి రైతన్నల పురోభివృద్ధికి చిత్తశుద్దితో కృషిచేద్దామని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాటిల్, సబ్‌కలెక్టర్ సంకేత్ కుమార్, భైంసా, కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్ పాటిల్, గోనేకర్ కళ్యాణ్‌లు కాంటాకు పూజలు నిర్వహించి సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. విక్రయానికి సోయా దిగుబడులను తీసుకవచ్చిన రైతులను సన్మానించారు. ఇందులో ఏఎం సీ వైస్ చైర్మన్ ఫారుఖ్, డైరెక్టర్ తోట రాము, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గంగాచరణ్, పీఏసీఎస్ చైర్మెన్లు అమెడ దేవేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మెన్లు గన్ను నర్సారెడ్డి, సిద్దం వివేక్,మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అంజీ ప్రసాద్, భైంసా మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ భైంసా మండల అధ్యక్షులు సిరం సుష్మారెడ్డి, ప్రతినిధి సోలంకే భీంరావ్ పాటిల్ పాల్గొన్నారు.

పట్టుదలే విజయానికి సోపానం

- హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్



మాట్లాడుతున్న మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్

దిలావర్‌పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టుదలే మన విజయానికి తొలి మెట్టని హైకోర్టు మాజీన్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. బుధవారం దిలావర్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థి జీవితంలో సంకల్పం, పట్టుదల, శ్రద్ధ, అతి ముఖ్యమైన వన్నారు. ప్రస్తుత సమాజంలో నిజాయితీ లోపించడం వల్లనే ఎన్నో అరాచకాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ నిజాయితీ కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పట్టుదలతో పనిచేయడం వల్లనే అనేక మంది పేదవారు సైతం ఎంతో ఉన్నత స్థితికి చేరారన్నారు. అబ్దుల్ కలాం, లాల్ బహదూర్ శాస్త్రి మొదలైన వారే అందుకు నిదర్శనమని చెప్పారు. పేదరికం చదువుకు అడ్డుకారాదని, ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విద్యార్థులతో మాటామంతి కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కే. శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సదానందం, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం చేయండి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోనున్న కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని, తద్వారా సత్వర న్యాయం చేయాలని ఎస్పీ డా.జానకీషర్మిల ఆదేశించారు. బుధవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రీవేన్స్‌డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ డా.జానకీ షర్మిల మాట్లాడుతూ బాధితులకు పోలీసు అధికారులు కాలయాపనకు తావులేకుండా సత్వరన్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అయా ఫిర్యాదులను సంబంధిత పోలీసుస్టేషన్ ఎస్ఐలకు వివరించి పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా, నిర్దేశం చేశారు. బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. ఇదేక్రమంలో గ్రీవెన్స్‌డేలో భాగంగా ఇదివరకు స్వీకరించిన ఫిర్యాదులు, వాటిలో పరిష్కరించిన, పెండింగ్‌లోనున్న వాటిపై అయా పోలీసుస్టేషన్ల ఎస్ఐలతో సమీక్షించారు. పెండింగ్‌లోనున్న ఫిర్యాదులను జాప్యపు విధానాలకు తావులేకుండా పరిష్కరించాలని తెలిపారు. ఇందులో భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్, సబ్‌డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, పలు పోలీసుస్టేషన్ల ఎస్ఐలున్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

లోకేశ్వరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి లోకేశ్వరం మండల కేంద్రంలో భగత్‌సింగ్ చౌక్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో లోకేశ్వరం ఎస్సై అశోక్, పోలీస్ సిబ్బంది, మండల నాయకులు, యువకులు పాల్గొని అమరులకు నివాళి అర్పించారు.

మునిసిపల్ కార్యాలయంలో అంతులేని అక్రమాలు

- బీజేపీ నాయకుల ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ భైంసా పట్టణ మాజీ అధ్యక్షుడు బాలాజీ సూత్రావే

భైంసా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో అడ్డు,అదుపూ లేకుండా కొనసాగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని భైంసా బీజేపీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ అవరణలో బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ కపిల్ సిందే, పట్టణ కమిటీ మాజీ అధ్యక్షులు బాలాజీ సూత్రావే, జిల్లా ప్రతినిధి రావుల పోశెట్టిలు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓనర్‌షిప్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో అక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది లోపాయికారి విధానాలతో నిబంధనలను కాలరాస్తూ ఇష్టారాజ్యంగా ఓనర్‌షిప్ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారని వెల్లడించారు. రూ.15 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాలకు కాకుండా ఒక వర్గం ప్రజలు,వ్యాపారులు ఉన్న ప్రాంతాలకే అధిక మొత్తంలో కేటాయించారని వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య కార్మికుల వేతనాలు,పీఎఫ్ విషయాల్లో చోటు చేసుకున్న అవినీతి,అక్రమాల పర్వాన్ని నిగ్గు తేల్చేందుకు నియమించిన సబ్‌కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ సారధ్యంలోని కమిటీ విచారణ విషయాలు ఎందుకు వెల్లడి కావడం లేదని ప్రశ్నించారు. పది రోజుల వ్యవధిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, పారిశుధ్య కార్మికులకు న్యాయం చేస్తామని అధికారులు ప్రకటించి నెల రోజుల కాలం గడుస్తున్నప్పటికీ విచారణ వివరాలు వెలుగులోకి రావడం లేదన్నారు. వేతనాలు,పీఎఫ్‌తో పాటు అక్రమ వసూళ్ల పర్వానికి పాల్పడిని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు.

ఉపాధి గ్రామసభ

లోకేశ్వరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో బుధవారం ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. 2026-2027 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు లేబర్ సామాగ్రి బడ్జెట్ ఆమోదానికి రూపాయలు 2 కోట్ల 80 లక్షలతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు టీఏ శారద తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో సాల్మన్ రాజ్, పంచాయతీ సెక్రటరీ రాజేశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ అంబకంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.